

మృతురాలి కుటుంబానికి రూ.10లక్షలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం సమీపంలో జెయింట్‌వీల్ కమ్మి విరిగి కిందపడి లోకేశ్వరి చనిపోయిందని, ఆమె కుటుంబానికి 10 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, ఆసుపత్రిలో ఉన్న మహిళకు అన్ని వైద్య ఖర్చులు ప్రభుత్వం భరించాలని, ఈ ఘటనకు బాధ్యుడైన పరిపాలన అధికారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఈ ఘటన పైన కలెక్టర్ జోక్యం చేసుకొని వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేసింది. శిల్పారామంలో చూడటానికి గాయత్రి, లోకేశ్వరి కుటుంబాలు వెళ్లిన సందర్భంగా జెయింట్‌వీల్ పైకి వెళ్లినపుడు 20 అడుగుల ఎత్తు నుంచి కమ్మి విరిగిపోవడంతో అక్కడనుంచి కింద పడిపోయారన్నారు. వారిని ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో లోకేశ్వరి చనిపోయింది. గత కొన్ని రోజుల నుంచి జెయింట్‌వీల్ చక్రం సరిగ్గా పనిచేయడం లేదని, కనీసం గ్రీస్ కూడా పూయడం లేదని తమ విచారణలో తేలిందన్నారు. శిల్పారామం నిర్వహణ సరిగ్గా లేదన్నారు. ఓ వ్యాపార కేంద్రంగా మారిపోయిందన్నారు.

నా ఛానల్ టివి 5

నా అజెండానూ 'ఇదే'

నేడు బాధ్యతలు స్వీకరించనున్న బిఆర్ఎన్

'శ్రీవాణి' ట్రస్టు టిటిడి నూతన బోర్డుకు సవాలే..

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి ధర్మకర్తల మండలి సభ్యుల అభిప్రాయాలతో సమష్టి నిర్ణయాలు ఉంటాయి అంటూనే టీటీడీ నూతన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న బీఆర్ నాయుడు తన ప్రాధమ్యాలను వెల్లడించారు. టీటీడీ ఛైర్మన్‌గా టీవీ5 బీఆర్ నాయుడు నియమితులైన విషయం తెలిసిందే. ఈయనతో పాటు 24 మంది పాలక మండలి సభ్యులనూ నియమించారు. బాధ్యతలను స్వీకరించకముందే టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్. నాయుడు అజెండాను సిద్ధం చేసుకున్నారు. గత ఛైర్మన్లు ఎవరూ ఈ విధంగా ముందస్తుగా ప్రకటించిన దాఖలా లేదు. తాను సిద్ధం చేసిన అజెండాలో కొన్నింటిని వెల్లడించారు. తన ఛానల్ టివి 5 అని, టిటిడి ఛైర్మన్‌గా తన ముందున్న ప్రధాన సవాళ్లు 5 అంశాలని స్పష్టం చేశారు. బుధవారం తెల్లవారుజామున బాధ్యతలు స్వీకరించనున్న బిఆర్ నాయుడు మంగళవారం తన సొంతూరైన పెనుమూరు మండలానికి వెళ్లారు. సొంతూళ్లో ఆయనకు ఘన స్వాగతం లభించింది. రాత్రికి తిరుమలలో బస చేశారు. టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తిరుమలలో ప్రక్షాళనకు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగనున్నట్లు స్పష్టం చేశారు.

టిటిడి నుండి రూపాయి తీసుకోను

టీటీడీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత స్వామి వారి సన్నిధి నుంచి రూపాయి కూడా తీసుకోనని బీఆర్. నాయుడు స్పష్టం చేశారు. తిరుమలలో తన ఖర్చులు తానే భరిస్తానని, స్వామివారికి సేవ చేస్తానని బీఆర్. నాయుడు ప్రకటించారు. తిరుమల గుడి వెనక ఏడు లక్షల టన్నులు చెత్త ఉంది. కొండపై ఉన్న చెత్త ఎలా తొలగించాలనే దానిపై త్వరలో చర్చిస్తాం. ప్రతి నిర్ణయం పాలకమండలి సమావేశంలో తీసుకుంటామని, తన సొంత నిర్ణయం అంటూ ఏదీ ఉండదని ఆయన స్పష్టం చేశారు.

బిఆర్ నాయుడు 'మనస్సులో మాట'

- ✓ తిరుమలలో 'హిందు' ఉద్యోగులే ఉండాలి.
- ✓ శ్రీవాణి ట్రస్టు రద్దు. (ప్రస్తుతం ఆడిటింగ్ జరుగుతోంది)
- ✓ టీటీడీ ఆలయ ఆస్తులపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీలు
- ✓ టీటీడీ ఆస్పత్రులు, యూనివర్శిటీపై ప్రత్యేక దష్టి
- ✓ తిరుమలలో వాటర్ బాటిళ్ల స్థానంలో పేపర్ గ్లాసులు.

సొంతూరు పూనేపల్లికి..

హిందూత్వ అజెండా అమలు

తిరుమలలో హిందూత్వ అజెండా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటానని బీఆర్. నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం టీటీడీలో ఉన్న హిందూయేతర ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇవ్వడమా? లేక ప్రభుత్వ ఇతర శాఖలకు పంపించాలా? అనేది పాలక మండలిలో చర్చించడానికి ముందు సీఎం చంద్రబాబుతో మాట్లాడతానని తెలిపారు. తిరుమల పవిత్రతను అందరూ కాపాడాలని, తిరుమలలో పనిచేసే వాళ్లు హిందువై ఉండాలనేది తన ప్రయత్నం అని ఆయన స్పష్టం చేశారు.

శ్రీవాణి ట్రస్టు రద్దు సాధ్యమేనా..?

టీటీడీలో అనేక ట్రస్టులు ఉన్నాయి. ఇక శ్రీవెంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు (శ్రీవాణి ట్రస్టు)తో పని ఏముంది? అనే అభిప్రాయం వ్యక్తం చేశారు. శ్రీవాణి ట్రస్టును రద్దు చేసే ఆలోచన ఉందన్నారు. అయితే "శ్రీవాణి ట్రస్టు రద్దు" సాధ్యమా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. దీనికి సీఎం చంద్రబాబు అంగీకరిస్తారా అనేది వేచి చూడాల్సిందే. ఎందుకంటే..

2018, ఆగష్టు 28న టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా 'శ్రీవాణి ట్రస్టు'కు ఊపిరి పోసింది సీఎం చంద్రబాబు నాయుడే. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఆలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాలకు ఆర్థిక సహకారం అందించడం ఈ ట్రస్టు ఉద్దేశ్యం. ప్రధానంగా అమరావతిలో నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సహకారం కోసం ఏర్పాటు చేశారు. దీనిపై అభ్యంతరాలు వస్తాయనే మిగతా ఆలయాలకు నిధులు ఇచ్చే నిబంధనలు చేర్చారు. కాగా, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీటీడీ అదనపు ఈఓగా పనిచేసిన ఏవీ. ధర్మారెడ్డి ఈ ట్రస్టును విస్తతం చేశారు. తిరుమలతో పాటు తిరుపతి శ్రీనివాసం యాత్రికుల సముదాయం, తిరుపతి విమాశ్రయంలోనూ కౌంటర్లు ఏర్పాటు చేశారు. 2019, సెప్టెంబర్ తీర్మానం ప్రకారం ఈ ట్రస్టుకు రూ. 10,500 చెల్లిస్తే, రూ. 500 వీఐపీ టికెట్ కేటాయిస్తున్నారు. మిగతా రూ. 10 వేలు ట్రస్టుకు వెళతాయి. ఈ నిధులతో ఆలయాల, జీర్ణోద్ధరణ, కొత్త ఆలయాలకు ఆర్థిక సాయం అందివ్వడం అనేది లక్ష్యం. ఆ విధంగా 2019 నుంచి 2024 వరకు 1,450 కోట్ల రూపాయలు వచ్చాయి. అందులో 350 కోట్ల రూపాయల వరకు పురాతన ఆలయాల పునరుద్ధరణ, 1853 ఆలయాలు దేవాదాయ శాఖ ద్వారా, 320 ఆలయాలు సమరసత సేవా ఫౌండేషన్ ద్వారా నిర్మాణాలు సాగిస్తున్నట్లు పూర్వ టీటీడీ ఛైర్మన్ వైవీ. సుబ్బారెడ్డి వివరణ ఇచ్చిన విషయం గమనార్హం. "ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల్లో 127 ప్రాచీన ఆలయాల పునరుద్ధరణకు రూ. 139 కోట్ల రూపాయలు కేటాయించినట్లు" వైవీ. సుబ్బారెడ్డి వివరణ ఇచ్చుకున్నారు.

శ్రీవారి ట్రస్టు నిధులు దారి మళ్లించారు అనే టీడీపీ, కూటమి నేతల ఆరోపణల నేపథ్యంలో ఆయన పత్రాలు బహిర్గతం చేశారు. కాగా, ప్రస్తుతం ఆ వ్యవహారంపై రాష్ట్ర విజిలెన్స్ విభాగం విచారణ జరిపింది. ఆడిటింగ్ జరుగుతోందనే విషయం తాజాగా టీటీడీ ఛైర్మన్ గా నియమితులైన టీవీ5 బీఆర్. నాయుడు మాటలు స్పష్టం చేస్తున్నాయి.

శ్రీవాణి ట్రస్టు వల్ల రాష్ట్రంలోని పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ, కొత్త ఆలయాల భారం రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని దేవాదాయ శాఖపై భారం తగ్గింది. ఈ ట్రస్టు రద్దు చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం భారం ఎత్తుకోవడానికి సిద్ధం అవుతుందా? దీనికి సీఎం చంద్రబాబు అంగీకరిస్తారా? అనేది వేచిచూడాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన మూడు బోర్డు సమావేశాల్లో 1750 కోట్లు కేటాయింపులపై టిటిడిలో పెద్ద దుమారం అయ్యింది. ఇప్పటికే ఇంజనీరింగ్ కేటాయింపులపై విజిలెన్స్ విచారణ చేపడుతున్న విషయం విదితమే. టిటిడిలో తానే నియంత అన్నట్టు పాలన సాగించిన మాజీ ఆడిషనల్ ఈఓ ధర్మారెడ్డి పై కూడా విచారణ జరుగుతుంది. స్టేట్ విజిలెన్స్ కమిటీ నిర్ణయం మేరకే కచ్చితంగా చర్యలు ఉంటాయని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి వెల్లడించారు. అయితే ధర్మారెడ్డి తీసుకున్న నిర్ణయాలుపై బోర్డు ఏ విధంగా చర్యలు చేపడుతుందో వేచి చూడాలి.

బిఆర్ నాయుడుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పూతలపట్టు

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలక మండలి ఛైర్మన్ బి ఆర్ నాయుడుకు ఎమ్మెల్యే మురళీమోహన్, పూతలపట్టు తెదేపా నాయకులు ఘన స్వాగతం పలికారు. పెనుమూరు మండలం పూనేపల్లె సొంత గ్రామానికి బిఆర్ నాయుడు వెళుతున్న సందర్భంగా మార్గమధ్యంలోని పూతలపట్టులో ప్రత్యేక స్వాగతం ఏర్పాట్లు చేశారు. కేరళ రాష్ట్రం నుంచి డ్రమ్స్, గుర్రపు బండిని తెప్పించి బండిపై ఛైర్మన్ తో పాటు ఎమ్మెల్యేను బండి పై ఎక్కించి జాతీయ రహదారిపై ఊరేగింపు చేయించారు. స్వాగత కార్యక్రమానికి పెద్ద ఎత్తున తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు. మండల కన్వీనర్ దొరబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

సిఐటియు అభినందనలు

చంద్రగిరిలో ఘన స్వాగతం

రామచంద్రాపురం (చంద్రగిరి) : తిరుమల పవిత్రతను కాపాడటం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకే సాధ్యం అని ఎంఎల్ఏలు పులివర్తి నాని, డాక్టర్ మురళీమోహన్ అన్నారు. ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయంలో దుశ్శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ కూడా ఉన్నారు.

- ఏర్పేడు గుడిమల్లం ఆలయ ఛైర్మన్ బత్తల గిరినాయుడు టిటిడి నూతన ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందించి శ్రీపరుశురామేశ్వర స్వామి ఆలయానికి ఆహ్వానం పలికారు.

సిఐటియు అభినందనలు

తిరుపతి టౌన్ : సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆధ్వర్యంలో టిటిడిలోని వివిధ యూనియన్లతో కలిసి తిరుమల గాయత్రినిలయం గెస్ట్‌హౌస్ వద్ద బిఆర్‌నాయుడును కలిసి అభినందించారు. భక్తులు, ఉద్యోగులు, కార్మికులు, తిరుపతి ప్రజలకు తోడ్పడేలా సామాజిక విషయాలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, రఘు, ప్రభాకర్, ఈశ్వర్‌రెడ్డి, సురేష్, శ్రీనివాసులు, చిట్టిబాబు, మధు, యుగంధర్ పాల్గొన్నారు.

వకుళమాత రోడ్డుకు

మోక్షమెప్పుడో..?

కోట్లు వృథా అవుతున్నా...

చలించని ఇంజినీర్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ప్రజల్లో ఎవ్వరికి ఏ కష్టమొచ్చినా వాటిని పరిష్కరించాలని, కుల, ప్రాంతాలకు అతీతంగా తిరుమల శ్రీవారిని వేడుకోవడం పరిపాటి. కానీ ఆ దేవదేవడి మాతృమూర్తికి వచ్చిన సమస్యను ఎవరు పరిష్కరిస్తారు?. వకుళామాత ఆలయానికి వెళ్లేందుకు కోట్లాది రూపాయలతో నిర్మించతలపెట్టిన రహదారి పనులు టిటిడి ఇంజినీర్ల నిర్లక్ష్యం కారణంగా ఆగిపోయాయి. ఇప్పటికే వెచ్చించిన కోట్ల రూపాయలు వృథా అవుతుండడం గమనార్హం. ఈ రహదారి నిర్మాణం గత పాలకుల హయాంలో ప్రారంభించారు. అయితే టిడిపి కూటమి హయాంలో దీన్ని కొనసాగిస్తారా, లేదా అన్న మీమాంశ స్థానికుల్లో అక్కడ నెలకొంది. రహదారుల అభివృద్ధికి రాజకీయాలను పక్కన పెట్టాలని వారు కోరుతున్నారు.

చెర్లోపల్లి నుంచి వకుళామాత ఆలయానికి వెళ్లేలా 4 కిలోమీటర్ల పొడవున ఫోర్‌లైన్ బిటి రోడ్డు నిర్మించేందుకు టిటిడి అధికారులు నిర్ణయించారు. బెంగుళూరు, వేలూరు, చిత్తూరు, కుప్పం మార్గాల నుంచి తిరుపతి మీదుగా తిరుమలకు వెళ్లే భక్తులు తిరుపతి-చంద్రగిరి 150 బైపాస్‌రోడ్డు మీదుగా వచ్చి, వకుళామాత ఆలయం నుంచి చెర్లోపల్లి, జూపార్కు మీదుగా అలిపిరికి చేరుకునేందుకు ఈ మార్గం ఎంతో ఉపయోగం. తిరుపతి వాసులకు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి. భక్తులకు సుమారు 10 కిలోమీటర్ల దూరం సైతం తగ్గుతుంది. ఎటు చూసినా ఈ మార్గం భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎంతో కీలకం. దీనికి సంబంధించి పాలకమండలి సైతం ఆమోదం తెలపడంతో పాటు 25 కోట్ల రూపాయలు సైతం కేటాయించారు. గత ఏడాది నవంబరులో టెండర్లు పిలిచి, ఓ గుత్తేదారుడి (కాంట్రాక్టర్)కి పనులు అప్పగించారు. ఈ మేరకు 2024, జనవరిలో పనులు అగ్రిమెంట్ కూడా పూర్తయింది. 2024 నవంబరులోపు పనులు పూర్తి చేయాలని అగ్రిమెంట్‌లో గడువు పెట్టారు. దీంతో కాంట్రాక్టరు వెనువెంటనే రహదారి పనులు మొదలెట్టారు. సుమారు 25 శాతం పనులు పూర్తి చేశారు. ఇంతలో టిటిడి ఇంజనీరింగ్ అధికారులు గుత్తేదారుని పిలిచి, రోడ్డును భవిష్యత్తు అవసరాల రిత్యా మరింత విస్తరించాల్సి ఉందని, అందుకు పాలకమండలి అనుమతి కూడా ఇచ్చిందని తెలిపారు. రోడ్డు విస్తరణ కోసం కొంత భూసేకరణ చేయాల్సి ఉందని, పనులను కొన్ని రోజులు వాయిదా వేయాలని సూచించారు. పది నుంచి 20 రోజుల్లో భూసేకరణ పూర్తి చేయాలనుకున్నా, నెల అయినా అధికారులు స్పందించకపోవడంతో కాంట్రాక్టరు అధికారులకు గుర్తు చేశారు. ప్రభుత్వానికి సిపార్సు చేశామని వేచి ఉండమని చెప్పారు. ఎట్టకేలకు మరో నెల సమయం తీసుకుని ప్రభుత్వం భూసేకరణ చేసి దాన్ని వివరాలను టిటిడికి అప్పగించింది. ఇందుకు సంబంధించి భూమిని కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో టిటిడి ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఇంతలోనే సాధారణ ఎన్నికలు రావడంతో ఎన్నికల సాకుతో పనులు ఆపేశారు. ఎన్నికల పూర్తయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా వకుళామాత ఆలయ రహదారి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. స్థానికులు టిటిడి అధికారులకు విన్నవిస్తే కాంట్రాక్టరును పిలిచి పాత పద్ధతి ప్రకారం నాలుగులైన్ల రోడ్డు (80 అడుగులే) వేయాలని ఉచిత సలహా ఇస్తున్నారు. దానికైనా గత అగ్రిమెంట్ ప్రకారం నిధులు కేటాయించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికే పూర్తయిన 25 శాతం పనులకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టరు పనులను ప్రారంభించకపోవడం గమనార్హం.

గంపెడాశతో స్థానికులు

గతంలో ఈ మార్గం చిన్న మెటల్ రోడ్డు, బండి రహదారి ఉండేది. ఆ దారి గుండా స్థానికులు బైపాస్‌రోడ్డుకు చేరుకునేవారు. టిటిడి అధికారులు విశాలమైన కొత్తరోడ్డు వేస్తామనడంతో గంపెడు ఆశలు పెట్టుకున్నారు. కొంత మేర పనులు జరగడంతో ఆనందం మరింత పెరిగింది. రోడ్డును మరింత విస్తరిస్తామనడంతో అభివృద్ధి చెందుతుందని స్థానికులు భూమిని సైతం ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. కొత్తగా వచ్చే పాలకమండలైన దీనిపై చర్చించి, తగు నిర్ణయం తీసుకుని, రోడ్డును వీలైనంత త్వరలో పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

1, 2 తేదీల్లో సిపిఎం తిరుపతి జిల్లా మహాసభ

8-14 తేదీల్లో 'ప్రజాపోరు' : వి.నాగరాజు

ప్రజాశక్తి - సత్యవేడు

డిసెంబర్ 1, 2 తేదీల్లో సత్యవేడులో జరగనున్న సిపిఎం తిరుపతి జిల్లామహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. సత్యవేడు మండల కేంద్రంలో సిపిఎం కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో మహాసభ ఏర్పాట్లపై సమీక్ష మంగళవారం జరిగింది. వందవాసి నాగరాజు మాట్లాడుతూ జిల్లా మహాసభను సిపిఎం శ్రేణులు జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువకులకు నిరాశే మిగిలిందన్నారు. మహిళలు, పిల్లలు, దళితులపై అత్యాచారాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్నారు. అయితే ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తుందన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, జెమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా నవంబర్ 8-14 తేదీల్లో 'ప్రజాపోరు' నిర్వహించనున్నట్లు చెప్పారు. నవంబర్ 15న కలెక్టరేట్, మండల కార్యాలయాల వద్ద పెద్దఎత్తున జరగనున్న ధర్నాల్లో

ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సత్యవేడు సిపిఎం కార్యదర్శి మెలుగు రమేష్, కె.వి.బి పురం, నాగలాపురం, పిచ్చాటూరు, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలకు సంబంధించిన సిపిఎం నాయకులు నాగరాజు, రమణయ్య, ధనంజయులు, మురుగేషన్, రామచంద్రారెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు మురళి, సిపిఎం కార్యకర్తలు అముదా, మునస్వామి, శేఖర్, కష్ణయ్య, సుబ్రమణి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎలమందలో ఏం జరిగింది..?

విద్యార్థినిపై అత్యాచారం అంటూ దుమారం

ఖండించిన పోలీసులు, కుటుంబ సభ్యులు

ప్రతిపక్షాలను అనుమతించని 'అధికారం'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి జిల్లా ఎర్రవారిపాలెం మండలం ఎలమందలో ఏమి జరిగిందన్నది అంతుచిక్కని ప్రశ్న. 10వ తరగతి చదివే బాలికపై అత్యాచారం జరిగిందంటూ సోషల్‌మీడియాలో దుమారం రేగితే, కుటుంబసభ్యులు, పోలీసులు మాత్రం ఖండిస్తున్నారు. అయితే ప్రతిపక్షాలు, విద్యార్థిసంఘాలు మాత్రం అధికార యంత్రాంగం ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శిస్తున్నాయి. పోలీసుల చర్యలు సైతం అలాగే ఉన్నాయి. కూటమి నేతలు మెటర్నిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించడానికి వస్తే లోనికి అనుమతించడం, ప్రతిపక్షాలకు, విద్యార్థిసంఘాలకు నిరాకరించడం విమర్శలకు తావిచ్చింది. మంగళవారం సాయంత్రం కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది. బాలికపై దాడి వెనుక హస్తం ఎవరన్నది పోలీసులు వెల్లడించాల్సి ఉంది. అత్యాచారం జరిగిందా? లేదా? అన్నది వైద్యాధికారులు వెల్లడించాల్సి ఉంది. అయితే బాధితురాలికి కస్తూరిబా విద్యాలయంలో అడ్మిషన్ ఇస్తున్నట్లు డిఇఒ కుమార్ ప్రకటించారు. వివరాలిలా ఉన్నాయి.

యర్రవారిపాలెం మండలం ఎలమందకు చెందిన ఓ బాలిక స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. సోమవారం సూలుకు వెళ్లిన బాలిక సాయంత్రం ఇంటికి వస్తుండగా ఇద్దరు అబ్బాయిలు బైక్‌పై వచ్చి, మత్తుమాత్రలు ఇచ్చి పొదల్లోకి తీసుకెళ్లి దాడి చేశారన్నది వాస్తవం. బాలిక ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతుక్కుంటూ రాగా పొదలమాటు నుంచి బాలిక మూలుగు వినిపించింది. వెంటనే పీలేరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి పోలీసులను ఆశ్రయించారు. మెరుగైన చికిత్స నిమిత్తం బాలికను తిరుపతి మెటర్నిటీ ఆస్పత్రికి మంగళవారం ఉదయం తీసుకొచ్చారు. రాత్రంతా నిందితులను విచారించిన పోలీసులు మంగళవారం సైతం ఏ విషయాన్నీ పత్రికలకు వెల్లడించకపోగా, దాడి మాత్రమే జరిగిందని చెప్పారు. కుటుంబసభ్యులతోనూ చెప్పించారు. విషయ తెలుసుకున్న తిరుపతి ఎంపి డాక్టరు గురుమూర్తి, మాజీ మంత్రి ఆర్‌కె రోజా, మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ టిటిడి బోర్డు ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ తిరుపతి డిప్యూటీ మేయరు భూమన అభినయ్‌రెడ్డి, మాజీ తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వేరు వేరుగా ఆసుపత్రి వద్దకు చేరుకుని బాదితురాలిని పరామర్శించేందుకు ప్రయత్నిస్తే పోలీసులు అనుమతి ఇవ్వలేదు. చంద్రగిరి ఎంఎల్ఏ పులివర్తి నానిని బాదితురాలిని పరామర్శించేందుకు అనుమతి ఇచ్చారు. జిల్లా ఎస్‌పి స్పందిస్తూ బాధిత బాలికకు వైద్య పరీక్షలు చేశామని, పరీక్ష ఫలితాలు రావాల్సి ఉందని, వాస్తవానికి ఆ బాలికపై ఎలాంటి అత్యాచారం జరగలేదని చెప్పారు. కుటుంబ సభ్యులు సైతం తాము ఫోన్ చేసిన 20 నిమిషాల్లోనే పోలీసులు స్పీడ్‌గా స్పందించి, తమకు అండగా ఉన్నారని, ఎవ్వరూ రాద్ధాంతం చేయవద్దని వెల్లడించడం గమనార్హం.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

ఆలయంలో ఫిర్యాదుల పెట్టె

నూతన ఈవో తొలి ప్రయత్నం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సుమారు 15 సంవత్సరాల కిందట శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న ఫిర్యాదుల పెట్టె మళ్లీ మంగళవారం దర్శనమిచ్చింది. ఆలయ ఆవరణలోని బంగారు ధ్వజస్తంభం పక్కనున్న వినాయకుడి గుడి ముందు ఈ ఫిర్యాదుల పెట్టెను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. భక్తులు తమ సమస్యలను, అభిప్రాయాలను రాతపూరకంగా తెలపవచ్చు. లేదా మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. దేవస్థానం ఏఈవో లోకేష్ రెడ్డిని బాధ్యుడిగా చేస్తూ ఆయన సెల్ ఫోన్ నెంబర్ను ఫిర్యాదుల పెట్టెపై రాయడం జరిగింది. ఈ మెయిల్ ఐడి కూడా ఉంది. అయితే ఫిర్యాదుల పెట్టెలను మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తే భక్తులకు అనుకూలంగా ఉంటుంది. సుమారు 15 ఏళ్ల క్రితం ఆలయ ఆవరణలో ఫిర్యాదుల పెట్టె కనిపించేది. ఆ తర్వాత వచ్చిన

అధికారులు ఫిర్యాదుల గురించి గానీ, ఫిర్యాదుల పెట్టె గురించి గానీ పట్టించుకోవడం మానేశారు. ఆదివారం ఈవోగా బాధ్యతలు తీసుకున్న బాపిరెడ్డి ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేయడంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మురుగునీరు డ్రెయినేజీ కాలువల ద్వారా సాఫీగా వెళ్లేలా అన్ని చర్యలు చేపడుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మంగళవారం ఉదయం 14 వ డివిజన్ లోని ఎమ్మార్ పల్లి, మజ్జిగ కాలువ, బైరాగిపట్టేడ, కేశావయన గుంట ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలసి డ్రెయినేజీ కాలువలను పరిశీలించారు. అలాగే 15 వ ఫైనాన్స్ నిధులతో న్యూ బాలాజీ కలని, చింతలచెను, అన్నమయ్య మార్గ్ వద్ద జరుగుతున్న అభివద్ధి పనులను పరిశీలించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.మహేష్, ఏసిపి బాలాజీ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య ఉన్నారు.

వన్యప్రాణులు రాకుండా చర్యలు

జనావాసాల్లోకి వన్యప్రాణులు రాకుండా చర్యలు చేపడతామని కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. కరకంబాడి మార్గంలోని బయోట్రిమ్, ఫారెస్టు నుంచి వన్యప్రాణులు ఉపాధ్యాయ నగర్‌లోకి వస్తున్నాయన్న ఫిర్యాదు మేరకు మంగళవారం సాయంత్రం స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేంద్రన్‌తో కలిసి బయోట్రిమ్, ఉపాధ్యాయనగర్ ప్రాంతాలను పరిశీలించారు.

విద్యుత్ ఛార్జీలు పెంచొద్దని సిపిఎం వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరిట డిస్కంలు ప్రతిపాదించిన 11,826.42 కోట్ల రూపాయల పెంపు ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, నేత జి. బాలసుబ్రహ్మణ్యం లు ఏపీ ఎస్పీడీసీఎల్ సిఎండి సంతోష రావుకు విజ్ఞప్తి చేశారు.

మంగళవారం సంతోష రావును కార్పొరేట్ కార్యాలయంలో సిపిఎం నేతలు కలిసి విద్యుత్ చార్జీల ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని కోరారు. 2023 - 24 సంవత్సరానికి వినియోగించిన విద్యుత్ పై ఇంధన సర్దుబాటు చార్జీల పేరిట రాష్ట్రంలోని డిస్కంలు ప్రతిపాదించిన 12 వేల కోట్ల రూపాయల భారం వినియోగదారులు మోయలేరని తెలిపారు. ఇందులో ఎస్పీడీసీఎల్ పేరిట రూ.3, 968.67 కోట్లు ప్రతిపాదించారని, గత ఏడాది ఈఆర్ సి అనుమతి లేకుండానే యూనిట్ కు 0.40 పైసల చొప్పున రాష్ట్రంలో డిస్కాంలు 3700 కోట్ల రూపాయలు వసూలు చేశాయని, ఎస్పీడీసీఎల్ పరిధిలో 1148.89 కోట్ల రూపాయలు ఇప్పటికే వసూలు చేశారని గుర్తు చేశారు. ఇప్పటికే విద్యుత్ నియంత్రణ మండలి 2022 - 23వ సంవత్సరానికి రూ.6072 కోట్లు వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలని అనుమతినిచ్చిందని, 2023 - 24 సంవత్సరానికి మరో 11,826.42 కోట్లకు అనుమతి ఇవ్వాలని డిస్కాములు ప్రతిపాదించడం దారుణమైందని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. కాంట్రాక్టర్లకు, ఉత్పత్తిదారులకు మేలు చేయటానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆ భారం ప్రజలపై మోపడం దారుణమని వినతి పత్రంలో పేర్కొన్నారు. పెంపు ప్రతిపాదనలు తక్షణం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలను పెంచాల్సి వస్తుందని ఆ పత్రంలో పేర్కొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాల్సిందే : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి

జిల్లా వైద్యాధికారులతో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సమీక్ష

జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిందేనని కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన వైద్య సేవల సదుపాయాల కల్పనపై రుయా, స్విమ్స్, బర్డ్, మెటర్నటీ, అశ్విని ఆస్పత్రుల సూపరింటెండెంట్ లతో జిల్లా కలెక్టర్ సమీక్షను మంగళవారం నిర్వహించారు. ప్రతిరోజు చికిత్స నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి పేషెంట్లు రావడం జరుగుతుందని, వారికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాల పైన వారికి అవగాహన కల్పించి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. మలేరియా, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబల కుండా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ శ్రీహరి, డిసిహెచ్ఎస్ ఆనందమూర్తి, రుయా, స్విమ్స్, ఈఎస్ఐ, అరవింద్ ఐ హాస్పిటల్, మెటర్నిటీ, టీటీడీ అశ్విని ఆస్పత్రుల సూపర్డెంట్లు రవి ప్రభు, రామ్, శ్రీధర్, అశోకవర్ధన్, పార్థసారథి, కుసుమ కుమారి, డిఐఓ శాంతకుమారి, జిల్లా మలేరియా అధికారి రూప్ కుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కోఆర్డినేటర్ రాజశేఖర్, జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ మేనేజర్ శివకుమార్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు రోడ్డు వేయాలని జెవివి వినతి

ప్రజాశక్తి - రేణిగుంట రేణిగుంటలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి బీసీ హాస్టల్ సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జెవివి కార్యదర్శి కే కుప్ప స్వామి, నాయకులు ఓ వెంకటరమణ పలు సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణిగుంట బీసి హాస్టల్ సమస్యలపై మీ దష్టికి తెచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన బాగు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.రోడ్డు వేసి, వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. కిటికీలు బాగు చేయించి, దోమల వల అమర్చాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పెంచలకోన ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ తానంకి నానాజీతో కలిసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో సీఎం సహాయ నిధిని నిర్వీర్యం చేశారన్నారు. ఎవరికీ అందించిన దాఖలాలు లేవు అన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.9 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించానన్నారు. ప్రస్తుతం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే నియోజకవర్గంలో పేదలకు రూ.10 లక్షల 63 వేల రూపాయలు అందిస్తామన్నారు. ఇవే కాకుండా ఎంతో మందికి సీఎం సహాయ నిధిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'యువతరం సేవా సమితి'కి ఉత్తమ రక్తదాత పురస్కారం

రక్త దాతకు ఉత్తమ పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రాణాపాయ స్థితిలో వున్న ఎంతో మందికి రక్తదానం చేసి ఆపన్న హస్తం అందిస్తున్న యువతరం సేవా సమితి శ్రీకాళహస్తి కమిటీకి ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్, కూన్ కా రిస్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తమ రక్తదాత పురస్కారం అందించారు. ప్రతి మూడు నెలలకు బ్లడ్ బ్యాంకులలో రక్త నిల్వలు తగ్గినప్పుడు యువతరం సేవా సమితి నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలకు, వారు చేస్తున్న అన్నదాన కార్యక్రమాలకు ఆ రెండు ఆర్గనైజేషన్లు యువతరం సేవా సమితికి అవార్డును బహూకరించాయి. యువతరం సేవా సమితి శ్రీకాళహస్తి కమిటీ పరిశీలకుడు జయకృష్ణ అవార్డును అందుకున్నారు.

కాపునాడు అధ్యక్షులుగా చంద్రశేఖర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం కాపునాడు అధ్యక్షులుగా గరికిపాటి చంద్రశేఖర్ బాబును నియమిస్తూ కాపునాడు జాతీయ అధ్యక్షులు గల్లా సుబ్రహ్మణ్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాపునాడు అధ్యక్షులుగా నియమితులైన గరికిపాటి చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేలా కృషి చేస్తానన్నారు. కాపు, ఒంటరి, తెలగ, బలిజ సామాజిక వర్గాల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తామన్నారు. కాపు నాడు పెద్దల సహాయ, సహకారంతో కాపు భవన్ నిర్మాణానికి పాటు పడతానన్నారు. కాపు యువతకు, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సరైన సమయంలో వరి నాట్లతో అధిక దిగుబడి: ఏవో

ప్రజాశక్తి -నాయుడుపేట: రైతులు సరైన సమయంలో వరి నాటు పూర్తిచేసి అధిక దిగుబడులు పొందాలని నాయుడుపేట మండలం వ్యవసాయ అధికారి జోగి గణేష్ రైతులకు సూచించారు. నాయుడుపేట మండలం చిగురుపాడు ద్వారకాపురం గ్రామాలలో ఆయన అధ్యక్షతన పొలం పిలుస్తోందిని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి పంట గురించి పలు సూచనలు చేశారు. ఉద్యానవన శాఖ ఏవో శారద మాట్లాడుతూ ఉద్యానవన శాఖలో రైతులకు ఉపయోగపడే వివిధ సబ్సిడీ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ బ్యాంకు ప్రతినిధి గురుస్వామి , వి ఏ ఏ రహమత్ రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఆడిటింగ్

ఉపాధి పనులపై ఆడిటింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులపై ఆడిటింగ్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 - 2024 ఆర్థిక సంవత్సరంలో 9 కోట్ల రూపాయల మేర ఉపాధి హామీ పనులు చేపట్టామని ఈ పనులకు సంబంధించి రెండు లక్షల మూడు వేల రూపాయలు రికవరీ వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ క్వాలిటీ కంట్రోలర్ సతీష్ బాబు, ఏపీడీ ప్రేమ్ కుమార్, ఎవివో గణేష్, ఎస్ఆర్పి రవి, ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్, ఏపీవో దినేష్ కుమార్, టిఏ లు, ఎఫ్ఏ లు ఈసీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న నరసింహులు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ నిపుణులు నరసింహులు తెలిపారు. మంగళవారం ఎంబీయు లోని దాసరి ఆడిటోరియంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ పాస్‌పోర్ట్, బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఫోన్ నెంబర్ మొదలైన ముఖ్య విషయాలకు సంబంధించి విద్యార్థులు జాగృతితో మెలగాలని తెలిపారు. ఒకవేళ ఇలాంటివి ఎవరైనా హాక్ చేస్తే ఏమాత్రం కంగారు పడకుండా సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు వెంటనే తెలపాలన్నారు. సైబర్ దొంగలు విపరీతంగా పెరిగిపోతున్నందున తగు జాగ్రత్తలు వహించాలన్నారు. వ్యక్తిగత విషయాలు ఏవి ఇతరులతో పంచుకోవద్దని మీ నెంబర్లు ఏవి ఇతరులకు తెలుపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిత, ఎంబియు డీన్ ఆచార్య గిరీష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక తనిఖీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఉచిత ఇసుక ఆంధ్ర సరిహద్దులు దాటకుండా పోలీస్ అధికారులు డేగ కన్ను వేశారు. ఈ నేపథ్యంలో సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి వద్ద ఇసుక తనిఖీ కేంద్రాన్ని మంగళవారం పుత్తూరు డిఎస్పి రవి కుమార్ ప్రారంభించారు. సత్యవేడు సిఐ మురళినాయుడు, నాగలాపురం ఎస్ఐ సునీల్ పర్యవేక్షణలో 12 మంది పోలీసు సిబ్బందిని తనిఖీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసామన్నారు.

వీరభద్రుని ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలోని కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో మంగళవారం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ వీరభద్ర స్వామి అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

సివిల్ సప్లై డిటి విష్ణు అరెస్ట్

అరెస్టు అయిన విష్ణు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :
ప్రభుత్వ రేషన్ బియ్యం అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకున్న స్థానిక సివిల్ సప్లై గొడౌన్ సిఎస్‌డిటిసి హెచ్ విష్ణును పుత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం పుత్తూరు కోర్టులో హాజరు పరచగా కోర్టు 14 రోజులు పాటు రిమాండ్ విధించింది. దీనికి సంబంధించి సిఐ కెవి సురేంద్ర నాయుడు మీడియాతో మాట్లాడుతూ జిల్లా సివిల్ మేనేజర్ సుమతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎసెన్షియల్ కమొడిటీస్ యాక్ట్ ప్రకారం క్రైమ్ నెంబర్ 166 /2024గా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ నేరంలో తొలి నిందితుడు ప్రస్తుతం సూళ్లూరుపేట ఆర్డిఓ ఆఫీసు డిప్యూటీ తహశీల్దారు అయిన సిహెచ్ విష్ణును ఈనెల 4వ తేదీ స్థానిక ఆర్‌డియం రైల్వే గేటు వద్ద కాపుకాచి అరెస్టు చేశామని తెలిపారు. ఇతన్ని విచారించగా గత 2022 డిసెంబర్ నుంచి 2024 ఆగస్టు వరకు పుత్తూరు మండలంలో స్టాక్ గోడన్ సిఎస్డిటిగా వ్యవహరిస్తూ 5,040 పిడిఎస్ ప్రభుత్వ బస్తాలను అక్రమంగా బయట వ్యక్తులకు అమ్మి 29.70 లక్షల రూపాయల సొమ్ము చేసుకున్నట్లు అంగీకరించాడని తెలిపారు. ఈ మొత్తం రూ. 17 లక్షల తనకున్న అప్పులకు చెల్లించినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన మరి కొందరిని విచారించాల్సిన ఉందని దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని సీఐ సురేంద్ర నాయుడు తెలిపారు.

ప్రేమ పేరుతో వేధింపులు

- యువకుడు వాగ్వివాదం
- బాధితురాలి ఫిర్యాదు
- కేసు నమోదు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ:
ఇంజనీరింగ్ చదువుతున్న ఓ యువతిని ప్రేమించమని ట్యాక్సీ డ్రైవర్ వేధించిన ఘటన తిరుపతి నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి కొరమీనుగుంటకు చెందిన ప్రసాద్ అనే యువకుడు ట్యాక్సీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తిరుపతికి చెందిన ఓ యువతి రంగంపేట వద్ద ఉన్న ఓ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతోంది. రంగంపేటకు వాహనంలో వెళ్లే సమయంలో యువతితో ట్యాక్సీ డ్రైవర్ పరిచయం పెంచుకున్నాడు. గతంలో తనను ప్రేమించాలని యువత వెంటబడి ట్యాక్సీ డ్రైవర్ వేధించాడు, ఇందుకు యువతి నిరాకరించింది. ఈ క్రమంలో ట్యాక్సీడ్రైవర్ ప్రసాద్ తన మిత్రులతో కలిసి నేరుగా యువతి ఇంటికెళ్లి ఆ అమ్మాయితో మాట్లాడేందుకు యత్నించాడు. యువతి తల్లి, బంధువులు అడ్డుకున్నారు. దీంతో ట్యాక్సీ డ్రైవరు, అతని మిత్రులు వారితో వాగ్వివాదానికి దిగి బెదిరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌వియు క్యాంపస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుకార్లను ప్రచారం చేయొద్దు..

యువతిని ప్రేమించాలని వేధించాడని ఓ ట్యాక్సీడ్రైవర్‌పై ఫిర్యాదు అందింది. దర్యాప్తు చేస్తున్నాం.. అక్కడ ఎలాంటి గొడవలు జరగలేదని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో, న్యూస్ ఛానల్స్‌లో తప్పుడు వార్తలు వస్తున్నాయి. ఇందులో ఎలాంటి నిజం లేదు.. వాస్తవాలను వక్రీకరిస్తూ వార్తలను ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. బాధితురాలు తన వివరాలను తెలపడానికి నిరాకరిస్తోందని, ఆమె అనుమతి లేకుండా వార్తలు ప్రచారం చేస్తే చట్ట ప్రకారం ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రాణాలు రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం బండారుపల్లికి చెందిన కోడూరు సుబ్రహ్మణ్యంరెడ్డి (50) ఇంటి నుండి వెళ్లిపోయి ఆత్మహత్య చేసుకుంటున్నాడని తన బంధువైన భక్తవత్సలం రెడ్డి ఈ నెల 4వ తేదీ రాత్రి పోలీస్ వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీస్ కంట్రోల్ రూమ్ వెంటనే స్పందించారు. ఈ విషయంపై పిసిఆర్ ఇన్‌స్పెక్టర్ సైబర్ పోలీసు వారి ద్వారా ఆ వ్యక్తి ఫోన్ లొకేషన్ తెలుసుకుని, సంబంధిత ఏర్పేడు పిఎస్ బ్లూ కోల్ట్ పిసి -1124 కి సమాచారం అందించారు. బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ ఫోన్ లొకేషన్ ద్వారా నవంబర్ 4వ తేదీ రాత్రే ఆత్మహత్యకు పాల్పడుతున్న కోడూరు సుబ్రహ్మణ్యం రెడ్డి తన సొంత వ్యవసాయ భూమి నుండి ఒక కిలోమీటరు దూరంలో ఉన్నట్లు గుర్తించి, అతనిని సురక్షితంగా వారి బంధువులకు అప్పగించారు.

ఎస్‌పి అభినందన

నిండు ప్రాణాన్ని కాపాడి కుటుంబ భవిష్యత్తు నిలబెట్టడంలో విశేష ప్రతిభ చూపిన పోలీస్ కంట్రోల్ రూమ్ పోలీసు సిబ్బంది, సీఐ సైబర్ క్రైమ్ పోలీసులు, ఏర్పేడు పోలీస్ స్టేషన్ బ్లూ కోల్డ్ కానిస్టేబుల్ -1124 ను ఎస్‌పి ఎల్ సుబ్బరాయుడు అభినందించారు.

శ్రీనివాసులుకు రాజ్యపురస్కార్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఈ నెల 7వ తేదీ విజయవాడలోని రాజ్ భవన్ నిర్వహించనున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ అవతరణ దినోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా శ్రీకాళహస్తి బాబుఅగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన సాలపాక్షి శ్రీనివాసులు రాజ్యపురస్కార్ సర్టిఫికెట్ అందుకోనున్నారు. గుంటూరులోని తాడికొండలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర శిక్షణా కేంద్రంలో ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు నిర్వహించిన రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపులో స్కౌట్ విద్యార్థి శ్రీనివాసులు ఉత్తీర్ణుడయ్యారు. రాజ్ భవన్‌లో ఈ 7న నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 10 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు గవర్నరు రాజ్య పురస్కార్ సర్టిఫికెట్లు అందిస్తారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి రెండో సారి శ్రీకాళహస్తి స్కౌట్ విద్యార్థి అవార్డు తీసు కుంటున్నారు. ఈ సందర్భంగా స్కౌట్ విద్యార్థి శ్రీనివాసులు కు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన స్కౌట్ మాస్టర్ షేక్ అజారుద్దీన్‌ను జిల్లా కమిషనర్లు టి రమేష్ బాబు, ఎంఎం రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం జయరాం, రాష్ట్ర సహాయ కార్యనిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు, సహాయ కమిషనర్ చింతలపూడి పార్వతి, స్కౌట్ మాస్టర్ యోగానంద, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్పలు అభినందించారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు: తహశీల్దారు

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): మండలంలోని ప్రభుత్వం భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ శివరాం సుబ్బయ్య హెచ్చరించారు. మంగళవారం ఇందిరమ్మ కాలనీ లో గుట్ట పోరంబోకు స్థలంలో అక్రమ ఇంటి నిర్మాణాలు, పునాదులను రెవెన్యూ అధికారులు కూల్చి వేశారు. పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారి సమీపంలోని చంద్రగిరి ఇందిరమ్మ కాలనీలో కొంతమంది ప్రభుత్వ గుట్ట భూములను చదును చేసి అమ్ముకోవటం ఆ స్థలాలలో అక్రమంగా ఇంటి నిర్మాణాలు చేయటం పైన ప్రజల నుండి ఫిర్యాదులు, సోషల్ మీడియా లో పెద్ద ఎత్తున కథనాలు ప్రచురించడంతో రెవెన్యూ అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు అయినా వెనుకకు తగ్గని ఆక్రమణదారులు తమ పనిని కానిస్తూ ఉండడంతో అధికారులు ఎట్టకేలకు ఉక్కు పాదం మోస్తూ ఎక్స్కవేటర్ యంత్రాల సహాయంతో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లా డుతూ పేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలను మంజూరు చేస్తోందని, కొంతమంది ప్రభు త్వ స్థలాలను తమ సొంత స్థలాలుగా అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. అక్రమణదారుల నుంచి కొనుగోలు చేసిన వారు నష్టపోక తప్పదని హెచ్చరించారు. తాము ప్రభుత్వ స్థలాలని గుర్తించి హెచ్చరిక బోర్డులు నాటితే కూడా లెక్కచేయకుండా ఇంటి నిర్మాణాలు అధికమయ్యాయి. అందుకే తాము యంత్రా లు సాయంతో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తు న్నామన్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్ ఐ భాస్కర్, గ్రామరెవెన్యూ అధికారులు, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఈ నెల 8వ తేదీ నుండి ప్రారంభం కానున్న నైపుణ్య గణనపై నారాయణవనం ఎంపిడివో కార్యాలయ ఆవరణలో నైపుణ్యాభివృద్ధి అధికారి ముళ్ళ రామిజబి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ 15 నుంచి 59 వయస్సు గల సంబంధించిన విద్యార్హతలు, ఉద్యోగం, అనుభవం, స్వయం ఉపాధి, సొంత వ్యాపారం తదితర వివరాలను ప్రశ్నావళిలో నింపాలన్నారు. దీనికి సంబంధించిన సమగ్ర శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో, ఈవోఆర్‌డి, ఏపీఎం, డిప్యూటీ తహశీల్దారు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : నైపుణ్య గణనను పటిష్ఠంగా చేపట్టాలని నైపుణ్యాభివృద్ధి అధికారి వై శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడివో కార్యాలయంలో పుత్తూరు మండల నైపుణ్యాభివృద్ధి అధికార అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ వివరాలను ప్రశ్నావళిలో నింపాలన్నారు. గణన చేపట్టే వారికి సమగ్ర శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : నైపుణ్య గణన సర్వే లో భాగంగా సచివాలయం ఎంప్లాయీస్‌కు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపిడివో మధుసూదన్ రావు, గూడూరు డివిజన్ అభివృద్ధి అధికారిణి వాణి పాల్గొన్నారు.

వ్యతిరేకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి..

ఎమ్మెల్యేకు ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి వినతి

ప్రజాశక్తి -కోట : ఎస్‌సి వర్గీకరణ వల్ల మాల జాతికి జరిగే అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి నెల్లూరు జిల్లా కమిటీ ప్రధాన సభ్యులు, అధ్యక్షులు మీజూరు మాధవ్ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్‌ను మంగళవారం కోరారు. ఈ సందర్భంగా ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మీజూరు మాధవ్ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేను కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ సలహాదారులు అరవ పార్వతయ్య, మోహన్ అంబేద్కర్, గౌరవ అధ్యక్షుడు దాసరి సుందరం, అధ్యక్షులు మీజూరు మాధవ్ సలహాదారులు కర్లపూడి వెంకటరమణయ్య, కార్యదర్శి పాలమల్లి, లీగల్ అడ్వైజర్ అశోక్, సహాయ కార్యదర్శి దార్ల ఏడుకొండలు, పనబాక హేమంత్(గని), గిద్దలూరు రఘు, కనుపూరు కృష్ణయ్య, కోశాధికారి కేశవ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

క్రైం న్యూస్

అక్రమ మద్యం పట్టివేత

ఇద్దరు మహిళల అరెస్టు

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేట, పెళ్లకూరు మండలాల పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసి వారి నుంచి మద్యం స్వాధీనం చేసు కున్నామని నాయుడుపేట ఎక్సైజ్ సీఐ అరుణ తెలిపారు. ఎక్సైజు సీఐ మాట్లాడుతూ ఎక్సైజ్ డిపార్టుమెంట్ చిత్తూరు డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస ఆచారి ఆదేశం మేరకు చిత్తూరు డివిజన్ ఎన్‌ఫోర్సుమెంట్ ఇన్‌స్పెక్టర్ కె సత్య నారాయణ నాయుడుపేట ఎక్సైజ్ సిబ్బందితో కలిసి నాయుడుపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నాయుడుపేట, పెళ్లకూరు మండలాల్లో తనిఖీ నిర్వహించారు. అక్రమంగా మద్యం కలిగివున్న ఇద్దరు మహిళలు మహిళలను అదుపులోకి తీసుకొని వారి వద్దవున్న 84 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పెళ్లకూరు మండలం తాల్వాయిపాడు గ్రామంలోని కనపర్తి అంకమ్మ ఆలయం వద్ద 30 బాటిళ్లు, నాయుడుపేట వెంకటగిరి మార్గంలోని గోమతి హోటల్ వద్దనున్న వైఎస్ఆర్ బొమ్మ సర్కిల్ దగ్గర బి విజయమ్మ వద్ద 54 బాటిళ్లు స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్ చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ రామచంద్ర, ఎం సురేంద్రబాబు, ఎస్ ప్రతాప్, ఎం చంద్రనాయర్, ఎస్ గీతా పాల్గొన్నారు.

ఈత కెళ్లి విద్యార్థి మృతి

ప్రజాశక్తి -కోట : చిట్టమూరు మండల మెట్టు గ్రామ సమీపంలోని స్వర్ణముఖి గుంతలో ప్రమాదవశాత్తు దిగిన కటికాల వీరేంద్ర సాయి(15) సోమవారం మృతి చెందాడు. కోట మండలం విద్యానగర్ ప్రకాశం కాలనీకి చెందిన విద్యార్థిగా మంగళవారం ఉదయం గుర్తించారు. మృతి చెందిన వీరేంద్ర సాయి మెట్టు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిచదువుతున్నాడని, సోమవారం సాయంత్రం పాఠశాల ముగిశాక తోటి విద్యార్థులతో కలిసి సమీపంలోవున్న స్వర్ణముఖి లో ఈతకు సరదాకు వెళ్లారు. కాలువ లోతుగా ఉండటాన్ని గమనించక పోవడంతో నీటిలో మునిగిపోయారు. వారిలో ముగ్గురు బయటపడగా వీరేంద్ర సాయి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, విద్యార్థి తలిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి కోసం గాలించి, మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాలెం ఆసుపత్రికి తీసుకెళ్లి పంచనామా చేసిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉన్మాది వీరంగం

పలువురికి కత్తిపోట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో మంగళవారం తెల్లవారుజామున ఓ ఉన్మాది వీరంగం సృష్టించాడు. 'నన్నే ఎదురిస్తావా?' అంటూ మణి అనే వ్యక్తి ముత్యాలమ్మ గుడి వీధిలో ఉంటున్న స్నేహితుడు సతీష్ పై కత్తితో దాడి చేశాడు. అడ్డొచ్చిన సతీష్ భార్య కీర్తన, మామ గణేష్ నూ తీవ్రంగా గాయపరిచాడు. దీంతో వారంతా రక్తమోడుతున్న శరీరాలతోటే వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్దకు పరుగులు తీశారు. పోలీసులే వారిని హుటాహుటిన చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. మణి పాత కక్షల నేపథ్యంలోనే సతీష్ కుటుంబంపై కత్తితో విరుచుకుపడ్డాడనీ వన్ టౌన్ సిఐ గోపి తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి సమీపంలో మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి(35) మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి జేబులో లభించిన చిత్తుకాగితాలు, బిస్కెట్ ప్యాకెట్లను బట్టి యాచకుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఉరి వేసుకొని మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి నెహ్రూ నగర్ లో కాపురం ఉంటున్న సరోజ(35) భర్తతో గొడవ కారణంగా మనస్థాపం చెంది మంగళవారం ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెస్ట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రజాశక్తి' విలేకరిని పరామర్శించిన ఎమ్మెల్యే

నిసార్ అహ్మద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట ప్రజాశక్తి విలేకరి నిసార్ అహ్మద్‌ను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆపరేషన్ చేసుకుని ప్రస్తుతం ఇంట్లోనే చికిత్స పొందుతున్నాడు. నిసార్‌అహ్మద్‌ను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని అధైర్య పడాల్సిన పనిలేదని ధైర్యం చెప్పారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పది లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టిడిపి పట్టణ అధ్యక్షులు ఎస్ మహబూబ్ బాషా, టిడిపి సీనియర్ నాయకులు మునస్వామి నాయుడు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన తొట్టంబేడు మండలం బసవయ్యపాలెంకు చెందిన ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్ వెంకటేష్ కుటుంబానికి మంగళవారం శ్రీకాళహస్తి పోలీస్, అటవీ శాఖలు తమవంతు ఆర్థిక సాయం అందించాయి. మొత్తం రూ. 2.90 లక్షల నగదును చెక్కు రూపంలో డీఎస్పీ నరసింహమూర్తి అందజేశారు. ఈ నగదులోనుంచే కొంత మొత్తాన్ని వెంకటేష్ పిల్లల మీద ఫిక్సడ్ డిపాజిట్ చేశారు.

గ్రామాన్ని అభివృద్ధి చేయండి..

తడుకు కార్యదర్శికి ఎగువ గూళూరు దళితుల వినతి

తడుకు కార్యదర్శికి వినతి పత్రం అందిస్తున్న ఎగువ గూళూరు దళితులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తమ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని తడుకు కార్యదర్శి నరేష్‌కు ఎగువ గూళూరు దళితవాడ వాసులు వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన కార్యదర్శి ఎగువ గూళూరుకు మంగళవారం స్వయంగా వచ్చి అర్జీని స్వీకరించి హామీలు నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఎగువ గూళూరు పెద్దలు, మహిళలు, యువకులు, ప్రతి ఒక్కరూ పార్టీకి అతీతంగా ఈ సభను హాజరయ్యారు. వారికి కార్యదర్శి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి శివయ్య, కళ్యాణ్, సుమన్, దాము, పుష్పరాజ్, జైకుమార్, హేమంత్, ప్రదీప్, రాజశేఖర్, శశికుమార్, సుధాకర్, శ్రీనివాసులు, నవీన్, మంగపతీ, రాకేష్, చిట్టిబాబు, అనూష్, హేమాద్రి, లవకుమార్, విశాల్, ప్రేమ్ కుమార్, గూళూరు సుబ్బమ్మ, జైల, చిత్రమ్మ, గీత, తులసిబాబు, అభిషేక్, గోవర్ధన్, సూరి, నరేంద్ర, అరుల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'సరికొత్త నూతన ఆలోచనలకు ఆహ్వానం'

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌వి వెటర్నరీ యూనివర్సిటీ అధికారులు

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పోషన్ ఇంక్యుబేటర్ కేంద్రం ఆధ్వర్యంలో అంకుర సంస్థలకు సరికొత్త నూతన ఆలోచనల ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కదిరి మోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మూడు స్కీమ్‌లకి సంబంధించిన దరఖాస్తు పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి వెటర్నరీ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి ఉప కులపతి డాక్టర్ జెవి రమణ, ఎస్‌వి అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ ఎంవి రమణ, రార్స్ ఏడిఆర్ డాక్టర్ వి సుమతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టర్ విడుదలతో 8 వ కోహోర్ట్, బ్యాచ్ అంకుర సంస్థల దరఖాస్తుల ఆహ్వానాన్ని ఘనంగా ప్రారంభించారు. గతంలో ఏపీతో పాటు తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి పలు రాష్ట్రాల నుంచి అంకుర సంస్థలకు, పరిశోధకులకు శిక్షణ ఇచ్చే వారమని తెలిపారు. ప్రస్తుతం నూతన అంకుర సంస్థల శిక్షణలో ఏపీకి సంబంధించిన పరిశోధకులు, అంకుర సంస్థల యాజమాన్యాలకు మాత్రమే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మూడు స్కీమ్ లకి సంబంధిం చిన దరఖాస్తు పోస్టర్లు విడుదల చేశారని, మొదటిది 'యోచ్' రూ.5 లక్షల వరకు ఐడియా ఫండింగ్, రెండ వది 'అగ్రి ఇన్వో' రూ.25 లక్షల వరకు ఫండింగ్, ఈ సంవత్సరం సరి కొత్తగా విద్యార్థుల కోసం మూడవ స్కీమ్ 'మెరిస్ట్యూ' ను ప్రారంభించారని, ఇందులో భాగంగా సరికొత్త అంకుర సంస్థల ఆలోచనలతో వచ్చే విద్యార్థులకు రూ.4 లక్షల వరకు ఫండింగ్ ఇవ్వనున్నారని డాక్టరు కదిరి మోహన్ వివరించారు. ఈ దరఖాస్తులకు డిసెంబర్ 4వ తేదీ గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు హెచ్‌టిటిపిఎస్:// డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఏఎన్‌జిఆర్ఏయు ఆర్ఏబిఐటి. ఓఆర్‌జి వెబ్‌సైట్‌ను చూడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, అంకుర సంస్థల యజమానులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ఆరణి అవినీతిపై విచారణ జరపండి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గెలిచిన నాటి నుండి తాను ఎమ్మెల్యేగా గెలవడానికి ఖర్చు చేసిన డబ్బును తిరిగి సంపాదించుకోవడానికి తన కుటుంబ సభ్యులు, అనుచరులతో ప్రత్యేక దందాకు పాల్పడుతున్నారని ఆయన అవినీతి అర్జనపై విచారణ చేయించాలని తిరుపతి టౌన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ వాసుదేవ యాదవ్ కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి లో నూతన మద్యం పాలసీ ద్వారా కేటాయించిన మద్యం షాపుల దుకాణాలలో చిత్తూరు కు సంబంధించిన తన అనుచరవర్గాన్ని దింపి ఆయనే నేరుగా షాపులను నడుపుతున్నారని, తిరుపతిలో దందాలను మొదలు పెట్టారని, మున్సిపాలిటీలో పెండింగ్ బిల్స్ కలిగిన ప్రతి కాంట్రాక్టర్లకు 15 శాతం కప్పం కట్టాలని హుకుం జారీ చేశారన్నారు. ఇప్పటి వరకు. రూ.100 కోట్ల ఆర్జనను ఎమ్మెల్యే దాటేశారన్నారు. టిడిఆర్ బాండ్ల విషయంలోనూ పర్సంటేజ్‌లు ఇవ్వాలని ఆదేశం చారన్నారు. తిమ్మినాయుడు పాలెం మార్గంలో భూమిని కోల్పోయిన వారిని ఇలానే బెదిరించారని ఆరోపించారు. అప్పట్లో మాస్టర్ ప్లాన్ రోడ్ల విషయంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డికి వెయ్యి కోట్లు ముట్టాయని గగ్గోలు పెట్టారని, ఇప్పుడు తమ ఆరోపణలపై విచారణ చేసి నిజాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టౌన్ బ్యాంకు డైరెక్టర్లు అమర్నాథ్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, చింతా రమేష్, మాధం చంద్ర, హరికృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

చెవిరెడ్డి ఎదుగుదలకు కారణం మేమే..

- మబ్బు దేవనారాయణ రెడ్డి

మాట్లాడుతున్న మబ్బుదేవనారాయణరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ ఎదుగుదలకు కృషి చేసింది తామేనని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బుదేవనారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెవిరెడ్డి మొదటిసారి జెడ్‌పిటిసిగా సభ్యుడిగా 6వేల ఓట్ల మెజార్టీతో గెలుపునకు కష్టపడ్డామన్నారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎదగడానికి కృషి చేసింది తమకుటుంబం అయితే తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని తన గురువుగా చెప్పుకుంటాడని, గురువుకే వెన్నుపోటు పొడిచే శిష్యుడని లోకానికి తెలుసన్నారు. చెవిరెడ్డి తన కుమారుడి ఓటవికి తమను బాధ్యులను చేసి మాట్లాడడం సరి కాదని, తన క్యాడర్ ను విస్మరించడం వల్లే మోహిత్ రెడ్డి ఓటమి పాలయ్యాడన్నారు. తిరుపతిలో కాకుండా రూరల్ మండలాలతో తన తండ్రి మబ్బురామిరెడ్డి చేసిన సేవలను ఇప్పటికీ ప్రజలు మరువలేదని, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి ఓటు వేస్తే తనకు వేసినట్లే అని ప్రజలకు చెప్పి నాని అఖండ మెజార్టీతో గెలిపించుకున్నామన్నారు. ఈ సమావేశంలో చంద్రబాబు, సిద్దారెడ్డి, వాసుదేవరెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

ప్రశ్నించడానికే పవన్ పార్టీ: కిరణ్ రాయల్

మాట్లాడుతున్న కిరణ్‌రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పవన్ కళ్యాణ్ ప్రశ్నించడం కోసమే పార్టీ ఏర్పాటు చేశారని, పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవేశంలో మాట్లాడిన దాన్ని వైసిపి నేతలు సోషల్ మీడియా వేదికగా తప్పుడు సంకేతాలు వచ్చేలా ట్రోల్స్ చేస్తున్నారని జనసేన తిరుపతి అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ కిరణ్ రాయల్ అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దీనిపై మాజీ మంత్రి రోజా రాజీనామాలు చేయాలని డిమాండ్ చెయ్యడం విడ్డూరమని, 'ఇదేమైనా జబర్దస్త్ సీట్లు అనుకుంటున్నారా?' అని రోజాను ప్రశ్నించారు. ప్రజలు వైసిపి పాలన వద్దని తమకు అత్యధిక మెజారిటీని ఇచ్చి తమకు పాలనకు అవకాశం కల్పించారన్నారు. తిరుమలలో మాజీ మంత్రి అంబటి రాంబాబు జగన్ లోగోతో ఉండే స్టిక్కర్‌తో శ్రీవారి దర్శనం చేసుకొని రావడం నిఘా వైఫల్యంగా భావిస్తున్నామని, అప్రమత్తంగా లేకుంటే కొండపైకి బ్యానర్లతో వారు వస్తారని టిటిడి అధికారులకు సూచించారు. ఆకేపాటి సుభాషిణి మాట్లాడుతూ వైసిపి తనని రాజకీయంగా నియంత్రించాలని అంతర్జాలంలో ఒక పేజీని సృష్టించి అశ్లీలంగా తన ఫొటోలను మార్పు చేసి ప్రదర్శించారని, దీనిపై అప్పట్లో పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవేశంతో అన్న మాటలను రాష్ట్ర హోంమంత్రి సాధారణంగా తీసుకొంటే వైసిపి నాయకులు చిచ్చులు పెట్టాలని తీవ్ర ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సుమన్ బాబు, నవీన్, మురళి, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
బుధవారం 6 నవంబరు 2024

' రెడ్ సంస్థ సేవలు అభినందనీయం'

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యుల సహకారంతో గత ఆరు సంవత్సరాల నుండి ప్రత్యేక ప్రతిభావంతులకు సేవ చేసే అవకాశం కలిగిందని ఆంధ్ర మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ రోహిణి తెలిపారు .గూడూరు పట్టణంలోని శ్రీ కళ్యాణ వీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యుల సహకారంతో ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర మహిళ మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీకి సభ్యులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ రెడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ప్రత్యేక ప్రతిభావంతులు పాల్గొన్నారు.

' నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయం'

ప్రజాశక్తి- రామచంద్రాపురం (తిరుపతి రూరల్) నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా స్వచ్ఛంద విద్యా వాలంటీర్లు కృషిచేసి అక్షరాస్యతను పెంపొందించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు శోభన్ బాబు అన్నారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం వెలుగు మండల మహిళా సమైక్య సమావేశ మందిరంలో తిరుపతి రూరల్ ఎంపీడీవో రామచంద్ర ఆధ్వర్యంలో ఏపీఎం నాగేశ్వర రావు అధ్యక్షతన ఉల్లాస్ కు చెందిన వాలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాస్యతతోనే విజ్ఞానం, అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ వయోజనులకు విద్యపై వాలంటీర్లు పూర్తి అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య శాఖ డిడి అత్తూరి నాగేశ్వర్ రెడ్డి, నోడల్ ఆఫీసర్ ప్రసాద్, సూపర్ వైజర్లు థామస్, శైలజ, వెలుగు సిబ్బంది,ఏరియా కో -ఆర్డినేటర్ వనజాక్షి, ఏపీఎం నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు తులసి, అనిత, వాణి వాలంటీర్లు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

మినీ గోకులం షెడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని చెందోడు పంచాయతీలో మంగళవారం మినీ గోకులం షెడ్లు ఏర్పాటు చేసేందుకు స్థానిక టీడీపీ నాయకులు, పశు వైద్యాధికారులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంగళవారం చెందోడులో మినీ గోకులం షెడ్డు నిర్మాణానికి శంకు స్థాపనానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు షెడ్డు నిర్మాణానికి పశువులు పెంపకం దారులకు 90 శాతం గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం దార్లలకు 70 శాతం రాయితీలు కల్పిస్తారని పశు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. మండలంలో 55 మినీ గోకులం షెడ్లు ఎంపికయ్యాయన్నారు. ఈ షెడ్లు నిర్మాణంలో ఎన్ ఆర్ ఈ జి ఎస్, పశు వైద్య శాఖల్లో భాగంగా పనులు జరుగుతాయని, రెండు నెలల్లో ఈ షెడ్లు నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు బందెల రఘురామ్, తిరుపతి జిల్లా నిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కర్ రెడ్డి, మేకల శ్రీనివాసులు, చల్లా కృష్ణ, చంద్ర,పశు వైద్యాధికారి రాజేష్, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ చల్లా అనిత, పాడిరైతులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

నర్సిరెడ్డికి టిఎన్ఎస్ఎఫ్ నాయకుల స్వాగతం

ప్రజాశక్తి - క్యాంపస్ : టిటిడి పాలకమండలి సభ్యులు నన్నూరి నర్సిరెడ్డిని తిరుపతి ఎయిర్‌పోర్టులో టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్, తెలుగు యువత తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు అక్షింతల కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్, జానకి రామ్, చంటి, డాక్టరు హరికృష్ణ యాదవ్, రాజు, పాల్గొన్నారు.

టిటిడి చైర్మన్‌కు సిఐటియు అభినందనలు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: టీటీడీ చైర్మన్ గా నియమితులైన బిఆర్ నాయుడును సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అభినందించారు. మంగళవారం సాయంత్రం తిరుమల గాయత్రి నిలయం గెస్ట్ హౌస్ వద్ద సిఐటియు నాయకులు, టీటీడీలోని వివిధ యూనియన్లతో కలిసి బిఆర్ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు. బిఆర్ నాయుడు పదవీ కాలంలో భక్తులు, ఉద్యోగులు, కార్మికులు, తిరుపతి ప్రజలకు తోడ్పడే సామాజిక విషయాలను చేపట్టాలని ప్రజానుకూలంగా వ్యవహరించాలని వారు బిఆర్ నాయుడు కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బిఆర్ నాయుడు మాట్లాడుతూ రానున్న కాలంలో అన్ని సమస్యలను చర్చించి పరిష్కారానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నేతలు టి సుబ్రహ్మణ్యం, ఎస్. జయచంద్ర, టీటీడీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు రఘు, ప్రభాకర్, టీటీడీ అటవీశాఖ యూనియన్ నేతలు ఈశ్వర్ రెడ్డి, సురేష్, శ్రీనివాసులు, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సంఘం నేతలు చిట్టిబాబు, మధు, యుగంధర్ పాల్గొన్నారు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తోడ్పడండి

ప్రవాసాంధ్రులకు, పారిశ్రామిక వేత్తలకు ఎమ్మెల్యే పిలుపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చాలా అవకాశాలున్నాయని, రాష్ట్ర అభివృద్ధి కోసం తోడ్పడాలని అమెరికాలోని ప్రవాసాంధ్రులకు, పారిశ్రామిక వేత్తలకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పిలుపు నిచ్చారు.అమెరికా పర్యటనలో ఉన్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ లోవా స్టేట్ ట్రెజరర్ రాబ్బీ స్మిత్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పలువురు పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, వ్యాపార వేత్తలతో సమావేశ మయ్యారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్ర మాలు, పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. ఏపీలో

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. వారి వెంట ఎన్ఆర్ఐ లు ఆరి నవీన్, బండా హరి, కొమ్మినేని విజయ్, డాక్టర్ కుమార్ ఉన్నారు.

న్యూరాలజిస్ట్ సంఘమిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -కోట : నెల్లూరు కిమ్స్ ఆసుపత్రి నుండి ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర కోట ఎన్ సీ ఆర్ నగర్ లో ఉన్న జనతా క్లినిక్ ఆసుపత్రికి వస్తున్నారని ఆయన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జనతా క్లినిక్ డాక్టర్ ఎమ్ జగదీష్ కోరారు. మంగళవారం డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి బుధవారం కోట జనతా ఆసుపత్రిలో డాక్టరు రోగులకు అందుబాటులో ఉంటారని అన్నారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో నరాల వ్యాధి సమస్యలతో బాధపడే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పక్షవాతం, మూర్ఛ వ్యాధి, తలనొప్పి, వెన్నుపూస, మూతి వంకర, కాళ్ళు చేతులు తిమ్మిర్లు, వణుకు, తలతిరుగుట, కండరాలు, నరాల బలహీనత, నీరసం, మెదడు, మతిమరుపు, కాళ్ళు లాగుట, గుంజుట లాంటి లక్షణాలు ఉంటే తప్పకుండా వచ్చి పరీక్షలు చేసుకుని చికిత్స పొందే అవకాశాన్ని వినియోగించు కోవాల న్నారు. అపాయిం ట్మెంట్ కోసం 9738577366, 9642 414572 ఫోన్ నెంబర్ లను సంప్రదించాలన్నారు.

మా డిమాండ్లు పరిష్కరించండి

104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏర్పేడు 104 సిబ్బంది ఏర్పేడు వైద్యాధికారిణి డాక్టర్ బి శివ ప్రియకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని అని కుటుంబాలను పోషించటం చాలా కష్టంగా ఉందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా 50 వేలు రూపాయల ఖర్చు తో నిర్వహించి ప్రజా ధనం వృథా కాకుండా చూడాలని 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ , డిఈఓ కు జిఓ నెంబర్ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పియఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలని, డియస్సి ద్వారా నియమితులైన సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టు లో పెట్టాలని, ఉద్యోగులకు

ఇన్సూరెన్స్ చేయించాలని, ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు వెంటనే చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో 104 సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల బత్తి రెడ్డి, డ్రైవర్ యోగానంద, ఏ ఎన్ యం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణ సర్టిఫికెట్లు అందిస్తున్న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ గణేష్‌కుమార్

ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ గణేష్ కుమార్

ప్రజాశక్తి - తిరుపతి:

ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను నిరుద్యోగులు, యువత, మహిళలు సద్విని యోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ గణేష్ కుమార్ పిలుపు నిచ్చారు. తిరుపతిలోని ఎస్వి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన పీఎంకేవై 4.0, స్కిల్ హబ్ శిక్షణ సెంటర్ని మంగళవారం పరిశీలించారు. అక్కడి యువతతో మమేకమై శిక్షణ విధానం పై ఆరా తీశారు. వాళ్ళ అభిప్రాయాలను తెలుసుకొని వాళ్లకి సూచనలు సలహాలు ఇచ్చారు. ట్రైనర్, ప్రిన్సిపల్ , డిఎస్డిఓ లతో మాట్లడుతూ ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు, ప్లేస్మెంట్ కల్పించేలా ఉత్తమ శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు.అనంతరం ఏపీఎస్ఎస్డిసి నాక్ శిక్షణ కేంద్రంలో పిఎం విశ్వకర్మ పథకం ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ కుమార్, ఏడిజి ద్వారకనాథ్ రెడ్డి, రీజనల్ హెడ్ ఆర్ లోకనాథం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో భేటీ అయిన టిటిడి ఉద్యోగుల సహకార బ్యాంకు డైరెక్టర్ దొరైరాజు

ఎమ్మెల్యేతో దొరైరాజు భేటీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ:

టిటిడి ఉద్యోగుల సహకార బ్యాంకు డైరెక్టర్ గా నూతనంగా ఎన్నికైన దొరై రాజు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ను మర్యాద పూర్వకంగా కలిశారు. బ్యాంకు అభివృద్ధి పథంలో తన వంతు పాత్ర పోషించాలని దొరై రాజు కు ఎమ్మెల్యే సూచించారు. దొరై రాజుకు శాలువ కప్పి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఉద్యోగుల సమన్వయ కమిటీ కన్వీనర్ విజయ్ కుమార్ , రామకృష్ణ, బాలాజీ, జయకుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యేకు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట మండల కేంద్రంలో నిర్వహించనున్న ప్రజా దర్బార్ కార్యక్రమానికి విచ్చేస్తున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి రేణిగుంట సిపిఎం తరపున పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు . ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి హరినాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి అభినందనలు తెలిపారు . రేణిగుంట మండలంలో గత ప్రభుత్వం నుండి పరిష్కారం కానీ ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో రేణిగుంట టౌన్ పేదలకు సుమారు 4 వేల మందికి ఏర్పేడు మండలం పాగలి గ్రామం వద్ద ఇంటి పట్టాలు ఇచ్చి స్థలం చూపించకుండా మోసం చేశారన్నారు. రేణిగుంట ఎమ్మార్వో ఆఫీసు, చెంగారెడ్డిపల్లి తదితర చోట్ల ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అమ్ముకున్నారన్నారని, కబ్జాదారుల పై చర్యలు తీసుకోవాలని, ఇకనైనా ఎమ్మెల్యే చొరవ తీసుకొని రేణిగుంట పేదలకు మండల పరిధిలోనే ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతున్నామన్నారు. రేణిగుంట పంచాయతీ వినాయక నగర్ నుండి బిస్మిల్లా నగర్ రాజరాజేశ్వరి గుడి రైల్వే ట్రాక్ దారి రైల్వే పనులు కారణంగా మూసివేశారని, అండర్ గ్రౌండ్ బ్రిడ్జి దారి నిర్మించాలని కోరుతున్నామన్నారు. రేణిగుంట టౌన్ లో తాగునీటి సమస్య తరచుగా రావడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నీళ్ల సమస్య రాకుండా సక్రమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుద్ధ్యం సమస్య పరిష్కరించాలంటే రేణిగుంట పంచాయతీ అన్ని వార్డుల్లోనూ అండర్ డ్రైనేజీ కాలవలు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నామన్నారు. రేణిగుంట గ్రామ పంచాయతీ స్థలాలు కబ్జాలు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకొని ఆ స్థలాలను ప్రజా ప్రయోజనం కోసం ఉపయోగించాలన్నారు. రేణిగుంట సంతలో కనీస సౌకర్యాలు తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, సిసి రోడ్లు, షెడ్లు, గేటు, వాచ్‌మ్యాన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్ మల్లవరం పంచాయతీ మల్లవరం ఎస్టీ కాలనీ యానాదుల 13 మంది ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. కరకంబాడి ఎర్రగుట్ట లో పేదలు గుడిసెలు వేసుకొని సుమారు 36 రోజులు కాపురాలు వున్నా గత ప్రభుత్వం పోలీస్ బలగాలు పెట్టి బలవంతంగా ఖాళీ చేయించి 17 మంది పైన కేసులు పెట్టించిందని, ఆ 126 ఎకరాలు భూమిని ఇళ్లు లేని పేదలందరికీ ఎర్రగుట్ట స్థలాను పంచాలని కోరారు. రేణిగుంట పంచాయతీ వివేకానంద కాలనీ పక్కన పేదలు నిర్మించుకున్న సుమారు 130 ఇళ్లు కూల్చేశారని, అక్కడ నష్టపోయిన ప్రతి పేదవాడికి ఇంటి స్థలం కేటాయించి న్యాయం చేయాలని సిపిఎం కోరుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్య శ్రీ ,సెల్వరాజ్ పాల్గొన్నారు